# జైహింద్
## –పుట్టగంటి గోపీకృష్ణ



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

**నేలమీద పడిపోయి ఉన్న** ఒక పెద్ద మాను మీద ఇద్దరూ పడుకుని సిగరెట్ తాగటాన్ని ఆస్వాదిస్తున్నారు.

ఇంతలో అడవిలో చెట్ల మీదుగా ఎత్తుగా ఏదో విమానం ఎగురుతున్న శబ్దం వినిపించింది.

తినటం ఆపి తల పైకి ఎత్తి చూసింది డోల్మా. "ఈ జీవితంలో తీరని కోరిక అంటూ ఉందంటే అది విమానం ఎక్కటం..." అంది నిరాశగా.

"విమానం ఎక్కటమేనా? నడపాలని లేదా?" అంది ఫ్లోరెన్స్.

"ఆకాశంలో అంత ఎత్తున ఎగురుతున్న దాన్ని చూడటమే తప్ప భూమి మీద నిలబడినపుడు చూసిందే లేదు. ఇంక నడపటం కూడానా?"

డోల్మా మాటలతో ఫ్లోరెన్స్‌కు ఏదో తట్టింది. ఒక్కసారిగా లేచి కూర్చుంది.

ఆమెకు ఏదో కొత్త ఐడియా వచ్చిందని అర్థమయిన డోల్మా, "ఏమిటి? ఎందుకంత ఉత్సాహం?" అంది.

అయితే ఫ్లోరెన్స్ సమాధానం చెప్పలేదు.

మింటో ఇంటికి వచ్చేటప్పటికి ఫ్లోరెన్స్ అతని కోసం ఎదురు చూస్తూ ఉంది.

"ఎంత ఆశ్చర్యం? నీకోసం నేను ఎదురు చూడటమే తప్ప, నా కోసం నువు ఎదురు చూసే రోజు వస్తుందని నేను ఎప్పుడూ అనుకోలేదు..." అన్నాడు మింటో.

“డాడీ…” అంది ఫ్లోరెన్స్ గారంగా. “వచ్చిన కొత్తల్లో బోర్ కొట్టి కాలక్షేపం కోసం బయటకు వెళ్లేదాన్ని. అలా వెళ్లినపుడు కొందరు స్నేహితులయ్యారు. వాళ్లతో టైమ్ స్పెండ్ చేస్తూ అప్పుడప్పుడూ ఇంటికి రావటం లేట్ అయిందేమో. అదేదో ఎప్పుడూ బయటే ఉండిపోతున్నట్లు చెప్తావ్…”

నవ్వేశాడు మింటో. “అదేదో ఎంతో మంది స్నేహితులు ఉన్నట్లు నా ముందు బిల్డప్ ఇస్తావెందుకు? నీకు ఉంది ఒకే ఒక స్నేహితురాలు. ఆ అమ్మాయి పేరు డోల్మా కదూ…”

“ఇవన్నీ నీకు ఎలా తెలుసు డాడీ?”

“నీతో లేనంత మాత్రాన నీ బాధ్యత లేనట్లు కాదు కదమ్మా…”

నవ్వేసింది ఫ్లోరెన్స్.

“మొన్న ఒకరోజు టెన్నిస్ నేర్చుకుంటానన్నావు కదూ. ఇదిగో టెన్నిస్ క్లబ్ మెంబర్‌షిప్ తెచ్చాను.” ఒక కాగితం చూపిస్తూ అన్నాడు మింటో.

“ఇప్పుడు నాకు ఆ ఇంటరెస్టు పోయింది డాడీ.”

నిశ్చేష్టుడయ్యాడు మింటో. “అదేంటమ్మా! నువ్వడిగావని కమీషనర్ గారిని బ్రతిమలాడి మరీ ఆ మెంబర్‌షిప్ సంపాదించాను.”

“ఇప్పుడు అడగబోయే దానికి అంత కష్ట పడనవసరం లేదులే డాడీ.”

“ఇంత బిల్డప్ ఇస్తున్నావంటే ఏదో పెద్ద టెండరే పెట్టబోతున్నావని నాకు అర్ధమవుతోంది.”

“నా స్నేహితురాలికి విమానాన్ని దగ్గరగా చూడాలని ఉంది.”

“అది రాయల్ ఎయిర్‌ఫోర్స్ రూల్సుకు వ్యతిరేకం. విమానాలను సివిలియన్స్ ఎవరికీ చూపించ కూడదు.”

“అయితే మా ఇద్దరినీ ఎయిర్‌ఫోర్సులో చేర్చుకోండి.”

“ఆడవాళ్లని ఎయిర్‌ఫోర్సులో చేర్చుకోరు.”

“ఏది అడిగినా ఏదో ఒకటి చెప్తావు. కూతురు అడిగిన ఇంత చిన్న కోరిక కూడా తీర్చలేవా?” కన్నీళ్లు పెట్టుకుంటూ అంది ఫ్లోరెన్స్.

కూతురు కన్నీళ్లు పెట్టుకుంటే చూడలేక పోవటం మింటో బలహీనత.

మరుసటి రోజు డోల్మాని తీసుకుని ఎయిర్‌ఫీల్డ్ వైపు వెళ్లింది ఫ్లోరెన్స్.

మెయిన్ గేటు దగ్గరే వారిని అడ్డుకున్నారు యూనిఫాంలో ఉన్న సైనికులు.

అయితే లోపల నుండి మింటో వచ్చి వీరిద్దరినీ తనతో ఆఫీసు భవనం లోపలకు తీసుకు వెళ్లాడు.

“నిజంగా విమానాన్ని చూపిస్తారా?” గుసగుసగా అడిగింది డోల్మా.

ఫ్లోరెన్స్ సమాధానం చెప్పలేదు. సన్నగా నవ్వింది.

మింటో ముందు వారిని తన ఆఫీసుకు తీసుకు వెళ్లాడు. వారిని కూర్చో పెట్టి కాఫీ ఆర్డర్ చేశాడు. అక్కడ ఉన్న పరిచయస్థులకు వారిని పరిచయం చేశాడు.

కాఫీ తాగటం అయ్యాక వారిని తీసుకుని దూరంగా ఉన్న ఎయిర్‌ఫీల్డ్ వైపు తీసుకు వెళ్లాడు. వెడల్పుగా, తిన్నగా ఉంది తాత్కాలికంగా వేసిన రన్‌వే. రన్‌వేకు దూరంగా హ్యాంగర్లు ఉన్నాయి. వాటి తలుపులు వేసి ఉన్నాయి.

“మనం కారును గ్యారేజ్‌లో పెడతాం కదా... అలా అవి విమానాలను ఉంచే గ్యారేజిలు అన్నమాట. వాటిని హ్యాంగర్లు అంటారు.” చెప్పాడు మింటో.

అయితే అతను వీరిని అవి ఉన్న వైపు కాకుండా మరో వైపు నడిపించాడు.

“అదేంటి? హ్యాంగర్లు అటు ఉంటే మమ్మల్ని ఇటు తీసుకు వెళ్తున్నావు?” అడిగింది ఫ్లోరెన్స్.

“వాటిల్లో యుద్ధ విమానాలు, బాంబర్లు ఉంటాయి. సివిలియన్స్ వాటి దగ్గరకు వెళ్లటం సంగతి తరువాత దూరం నుండి చూడటం కూడా నిషిద్ధమే.”

“అయితే నాకు చేసిన ప్రామిస్ ఉత్తదేనా?”

“అయ్యో బేబీ! నేను ఉత్తుత్తి ప్రామిస్‌లు ఎప్పుడయినా చేశానా? అయినా నువు నన్ను విమానం చూపించమన్నావు కానీ యుద్ధ విమానం చూపించమని అడగ లేదుగా...” అన్నాడు మింటో.

వారి మాటల మధ్య వారు రన్‌వే మరో చివరకు వచ్చారు. అక్కడ నాలుగయిదు చిన్న విమానాలు నిలబెట్టి ఉన్నాయి. వాటి పక్కన ఒక వ్యక్తి నిలబడి ఉన్నాడు.

ముందుగా మింటో, “హలో అల్బర్ట్...” అంటూ అతనితో కరచాలనం చేశాడు. తరువాత, “ఈ అమ్మాయి నా కూతురు ఫ్లోరెన్స్. డోల్మా ఆమె స్నేహితురాలు...” అంటూ వారిద్దరినీ అతనికి పరిచయం చేశాడు.

మింటో ఆ తరువాత ఫ్లోరెన్స్, డోల్మా వైపు తిరిగి, “ఈయన విమానం నడపటానికి ట్రైనింగ్ ఇచ్చే ఇనస్ట్రక్టర్. మీకు ఈ విమానం గురించి దగ్గరుండి వివరిస్తాడు. నేను ఆఫీసుకు వెళ్తున్నాను. సరేనా...” అంటూ వారికి గుడ్‌బై చెప్పి వెళ్ళిపోయాడు.

“హలో లేడీస్...” అంటూ వారిని విమానం దగ్గరకు తీసుకు వెళ్లాడు అల్బర్ట్.

“ఇది టైగర్‌మోత్ విమానం. దీనిని నడపటం నేర్చుకోవటానికి వాడతారు. తీర ప్రాంతాలను కాపలా కాయటానికి కూడా వాడతారు. అప్పుడప్పుడూ బాంబింగ్ చేయటానికి కూడా వాడతారు. కానీ, అది చాలా అరుదు...”

“ఎందుకని?” అడిగింది డోల్మా.

“ఇప్పుడన్నీ ఫైటర్ విమానాలు వచ్చాయి. వాటి బాడీ దృఢంగా ఉంటుంది. వాటికి రెండు పక్కలా రెండు రెక్కలు మాత్రమే ఉంటాయి. దీనికి చూశారా... బాడీకి పైన రెండు కింద రెండు మొత్తం నాలుగు రెక్కలు ఉన్నాయి. పైగా దీనిది ఓపెన్ కాక్‌పిట్. ఫైటర్ విమానాలకు కాక్‌పిట్ పైన అద్దాలు బిగిస్తున్నారు....” అని వివరంగా చెప్పాడు అల్బర్ట్.

“నేను విమానం అంటే ఎంత పెద్దది ఉంటుందో అనుకున్నాను...” అంది డోల్మా.

“ఇది అన్నిట్లోకి చిన్న విమానం దీంట్లో ఇద్దరే పడతారు. ముందు కాక్‌పిట్‌లో ఒకరు. వెనుక కాక్‌పిట్‌లో మరొకరు. దీని కంటే ఫైటర్ ప్లేన్ పెద్దదిగా ఉంటుంది. దాని కంటే బాంబర్లు మరింత పెద్దవిగా ఉంటాయి. ఇక మనుషులను తీసుకు వెళ్లే విమానాలు అత్యంత భారీగా ఉంటాయి...” అల్బర్ట్‌కి కూడా ఇలా వీరితో మాట్లాడటం ఆటవిడుపుగా ఉండి అడిగినవన్నీ ఉత్సాహంగా వివరిస్తున్నాడు.

“దీనికి ఇంజిన్ ఎక్కడ ఉంటుంది?” అడిగింది ఫ్లోరెన్స్.

“ఇదుగో... ఇక్కడ ముక్కులో, ప్రొపెల్లర్ వెనుక ఉంటుంది. ఇది సింగిల్ ఇంజిన్ విమానం.”

“మరి గాలిలో ఉండగా ఇంజిన్ ట్రబుల్ వస్తే?” గాభరాగా అడిగింది ఫ్లోరెన్స్.

“తిన్నగా కిందకే...” చేత్తో నేలకు గుద్దుకున్నట్లు అభినయిస్తూ చెప్పాడు అల్బర్ట్. “అందుకే చెప్పేది... విమానం నడపటం అంటే మాటలు కాదు. ఎంతో డేంజర్...” వాళ్ల ముందు గొప్పలు చెప్తున్న అల్బర్ట్‌కు, తన మాటల ద్వారా ఎదుటి వారిలో కొత్త ఆలోచనలు రేకెత్తిస్తున్నానని తెలియదు. డేంజర్ అన్న మాట వినిపిస్తే మిగిలిన వారు ఆమడ దూరంగా వెళ్లిపోతారేమో, ఈ ఇద్దరు అదే డేంజర్‌ని వెతుక్కుంటూ వెళ్తారు.

ఈలోపు డోల్మా విమానం దగ్గరకు వెళ్లి దాని బాడీని తడిమి చూసింది.

“ఎలా ఉంది విమానం?” అడిగాడు అల్బర్ట్.

“ఏనుగు సైజులో ఉన్న సీతాకోకచిలుకలా ఉంది...” తడుముకోకుండా చెప్పింది డోల్మా.

ఆ పోలిక విని అల్బర్ట్, ఫ్లోరెన్స్ పెద్దగా నవ్వారు.

“ఇలా ఊరికే చూపించటమేనా, విమానం ఎలా నడపాలో నేర్పరా?” అడిగింది ఫ్లోరెన్స్.

“అది ఒక్క రోజులో నేర్చుకుంటే వచ్చేది కాదమ్మా...”

“ఏదయినా ఒక్కరోజుతోనేగా మొదలు పెడతారు...”

“అలా కుదరదులే కానీ, మొత్తం ఇంకా వివరంగా చూపిస్తా దగ్గరకు పదండి...” అంటూ వారిని తీసుకుని విమానం ముందుకు వచ్చాడు అల్బర్ట్.

“ఈ టైగర్‌మోత్ విమానాలలో ఎలక్ట్రికల్ సిస్టమ్ ఉండదు. అందుకని స్టార్ట్ చేయాలంటే ప్రొపెల్లర్‌ని గిర్రున తిప్పటం ద్వారా ఇంజిన్‌ని స్టార్ట్ చేయాలి...” ప్రొపెల్లర్ చూపిస్తూ చెప్పాడు అతను.

ఫ్లోరెన్స్ ప్రొపెల్లర్ రెక్కలు పట్టుకుని తిప్పబోయింది. అవి అంత తేలిగ్గా కదల్లేదు.

ఆమె చేయబోతున్న పని గమనించిన అల్బర్ట్, "జాగ్రత్త..." అంటూ అరిచాడు.

అతను ఎందుకు అరిచాడో తెలియక ఆమె వెనక్కి జరిగింది.

"దానికొక టెక్నిక్ ఉంది. వాటిని తిప్పుతూ మనం వెనక్కి రావాలి. లేకపోతే తీవ్రంగా గాయాలయ్యే అవకాశం ఉంది." అంటూ తను తిప్పి చూపించాడు.

"మరి ఇంజిన్ ఆన్ కాలేదే..."

వీళ్లు అంత తేలిగ్గా వదిలే రకాలు కాదని అర్థం చేసుకున్న అల్బర్ట్ నిట్టూర్చి ఇంజిన్ సైడు డోర్ ఓపెన్ చేసి ఏదో లీవర్ ఎడ్జస్ట్ చేశాడు. అతను చేస్తున్న పనిని గుర్తు పెట్టుకుంది ఫ్లోరెన్స్.

ఈసారి అల్బర్ట్ ప్రొపెల్లర్ రెక్కలు తిప్పగానే అది 'గుడగుడ' మని శబ్దాలు చేస్తూ స్టార్ట్ అయింది.

తరువాత ఫ్లోరెన్స్‌ని ముందు కాక్‌పిట్‌లో, డోల్మాని వెనుక కాక్‌పిట్‌లో కూర్చోపెట్టాడు. తను ఒక నిచ్చెన వేసుకుని విమానం పక్కన నిలబడి వారికి వివరించటం మొదలు పెట్టాడు.

"దీన్ని జాయ్‌స్టిక్ అంటారు. దీన్ని ఎడమ వైపు తిప్పితే ఎడమ రెక్క వెనుక భాగం కిందకు, కుడి రెక్క వెనుక భాగం పైకి లేస్తుంది. దానితో విమానం ఎడమ వైపు తిరుగుతుంది. అలానే జాయ్‌స్టిక్‌ని కుడి వైపు తిప్పితే విమానం కుడి వైపు తిరుగుతుంది. దీన్ని వెనక్కి లాగితే విమానం పైకి లెగుస్తుంది. ముందుకు నెట్టితే కిందకు దిగుతుంది."

"విమానం నడపటం అంటే అంతేనా?"

"అంతే... ఇవి కాక రడ్డర్ అని నీ కాళ్ళ దగ్గర ఉంటుంది. నేల మీద ఉన్నపుడు విమానాన్ని మలుపులు తిప్పాలంటే దాన్ని వాడతారు."

"మరి గాలిలోకి ఎగిరిన విమానాన్ని కిందకు దింపాలంటే..."

"మూడే పాయింట్లు. చదునయిన నేలను చూసుకోవటం. రెండు టైర్లు నెమ్మదిగా నేలకు ఆనేలా చూసుకోవటం, విమానం వెనుక భాగం నేలకు తగలకుండా చూసుకోవటం..." సింపుల్‌గా చెప్పాడు అల్బర్ట్.

"మమ్మల్ని ఒకసారి విమానంలో ఎగిరి రమ్మంటారా?" జోక్ చేస్తున్నట్లు అంది ఫ్లోరెన్స్.

"నా ఉద్యోగం నన్ను చేసుకోనివ్వరా ఏంటి? ఇక చాలు దిగండి..." అన్నాడు అల్బర్ట్.

ఇంతలో "ఏంటి అల్బర్ట్ బాగా విసిగించారా?" అంటూ అక్కడకు వచ్చాడు మింటో.

"అదేం లేదు సర్. అడోలసెంట్ క్యూరియాసిటీ..." అన్నాడు అల్బర్ట్ నవ్వుతూ.

"ఇక వెళ్దామా?" అన్నాడు మింటో డోల్మా, ఫ్లోరెన్సులతో.

రెండు రోజుల తరువాత మరోసారి కలుసుకున్నారు డోల్మా, ఫ్లోరెన్స్. కోహిమా దగ్గరలో ఉన్న జాపూ పర్వతాన్ని ఎక్కటానికి వారు బయలుదేరారు. 9500 అడుగుల జాపూ పర్వతం ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో ఎత్తయిన పర్వతం.

మామూలు మనుషులు ఆ పర్వతాన్ని ఎక్కడానికి ఆపసోపాలు పడతారు. అయితే వీరిద్దరూ దాన్ని చులాగ్గా ఎక్కేస్తున్నారు. కొంత దూరం ఎక్కాక ఆగి చెరొక సిగరెట్ వెలిగించారు. విశ్రాంతిగా పచ్చిక మీద నడుము ఆనించి సిగరెట్ ఎంజాయ్ చేస్తున్నారు.

అలా విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో మరోసారి వారి మధ్య టైగర్‌మోత్ ప్రస్తావన వచ్చింది.

"ఆ విమానం ఎంత బాగుందో కదా?" అంది డోల్మా.

"అవును. అది చూడటానికే అంత బాగుంది. ఇక దాంట్లో ఎగిరితే ఎంత బాగుంటుందో?" అంది ఫ్లోరెన్స్.

"నేను బ్రతికి ఉండగా అది తీరే కోరిక కాదేమో?"

"ఏయ్! డోల్మా... ఎందుకంత నిరాశ. విమానం ఎక్కటం అంత గొప్ప విషయం ఏమీ కాదు. ప్రయాణికుల విమానాలు కూడా ఉంటాయి. టికెట్ కొనుక్కుంటే వాటిలో ప్రయాణం చేయటం పెద్ద విషయం కాదు..."

"గదిలో బంధించినట్లు ఉండే ఆ డొక్కు విమానాల్లో ప్రయాణం చేయటం, మొన్న మనం చూసిన లాంటి టైగర్‌మోత్‌లో ప్రయాణం చేయటం ఒకటెలా అవుతుంది? అలా ఓపెన్ ఎయిర్‌లో మొహానికి గాలి తగులుతుంటే గాలిలో ఝుమ్మని ఎగురుతూ పోవటం ఎంత బాగుంటుందో?" ఊహల్లో నిజంగా ఆ సీను జరుగుతున్నట్లు ఊహించుకుంటూ అంది డోల్మా.

మొదటిసారి ఫ్లోరెన్స్ మనసులోకి లేనిపోని ఆలోచనలు వచ్చాయి. డోల్మా చెప్పినట్లు చేస్తే ఎలా ఉంటుందో అని ఊహించుకుంది. దాని ముందు ఈ కొండలెక్కటం ఇచ్చే కిక్కు ఏ మూలకూ రాదని అర్థమయ్యాక ఆమె మొహం నవ్వుతో వికసించింది.

మింటో ఆ రోజు ఉదయం హెడ్‌క్వార్టర్స్‌లో పని ఉందని కలకత్తా వెళ్లాడు. తిరిగి వచ్చేటప్పటికి రెండు రోజులు పడుతోందని, ఫ్లోరెన్స్‌ని జాగ్రత్తగా ఉండమని మరీమరీ చెప్పాడు.

ఫ్లోరెన్స్ బుద్ధిమంతురాలిలా తండ్రి చెప్పిన మాటలకు తల ఊపింది.

మింటో బయటకు వెళ్లగానే డోల్మాని ఇంటికి రమ్మని పిలిచింది. వారిద్దరు కలిసి ఎలా అయినా మొన్న చూసిన టైగర్‌మోత్ విమానంలో ఎగరాలని నిర్ణయించుకున్నారు.

అందరూ ఎయిర్‌ఫోర్స్ వాళ్లు ఉండే చోట తాము రంగురంగుల బట్టలు వేసుకు వెళ్తే ప్రత్యేకంగా కనిపించటమే కాదు, తేలిగ్గా అందరి కళ్లలో పడతారు. అందుకని ఇద్దరు బ్రైట్ కలర్స్ కాకుండా ప్లెయిన్‌గా ఉండే పాంటూ, షర్టూ వేసుకున్నారు. ఆ సాయంత్రం ఇద్దరు ఎయిర్‌ఫీల్డ్ వైపు వెళ్లారు. యథాప్రకారం గేటు దగ్గర సెక్యూరిటీ వాళ్ళు వీరిని ఆపారు.

"నేను మింటో వాళ్ల అమ్మాయిని." చెప్పింది ఫ్లోరెన్స్.

"కానీ ఆయన లోపల లేరే..." అన్నాడు ఒకతను.

"మేము వచ్చింది అల్బర్టుని కలవటానికి..."

"అలాగా..." ఏదో ఆలోచిస్తూ అన్నాడు ఆ సైనికుడు. పోయినసారి వీరు వచ్చినపుడు ఫోను చేస్తే మింటో గేటు దగ్గరకు వచ్చి తీసుకువెళ్లటం గుర్తు ఉంది అతనికి. ఇప్పుడు అల్బర్టుకు ఫోన్ చేయటం కుదరదు. అతను ఎప్పుడూ ఆరుబయట విమానాల దగ్గర ఉంటాడు. తనలో తను తర్జనభర్జన పడిన సెక్యూరిటీ వ్యక్తి ఎట్టకేలకు ఒక నిర్ణయానికి వచ్చాడు. "తెలిసిన అమ్మాయివి కాబట్టి లోపలకు పంపుతున్నాను. ఏ గొడవ చేయకుండా వచ్చేయాలి..." అంటూ గేటు తెరిచాడు.

సరాసరి ఎయిర్‌ఫీల్డ్ వైపు నడిచారు వారు. దూరంగా టైగర్‌మోత్ విమానాలు కనిపిస్తున్నాయి. వాటి దగ్గర ఎవరో కొంత మంది మనుషులు తచ్చట్లాడుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడే అక్కడకు వెళ్తే అల్బర్టు కంట్లో పడటం ఖాయం. అతను అక్కడి నుండి వెళ్ళి పోయే వరకు ఎక్కడయినా దాక్కోవాలి.

అటుఇటు చూసిన డోల్మాకు ఫైటర్ విమానాలు ఉంచే హ్యాంగర్ కనిపించింది. దాని తలుపులు వేసి ఉన్నాయి. దాని ముందు ఒక ట్రక్ ఆపి ఉంది. అటు వెళ్దాం రమ్మని ఫ్లోరెన్సును అటు నడిపించింది డోల్మా.

"ఇక్కడ ఎక్కడ దాక్కుంటాం?" అంటున్న ఫ్లోరెన్స్‌కి ట్రక్ కింద పడుకుందాం అని సైగ చేసింది డోల్మా.

"ఎవరికీ కనిపించమంటావా?"

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS